


# మనిషి మృగము

పాణమల్లి

క్రాస్‌రోడ్ దగ్గర బస్ దిగాడు గిరి.

దుమ్ము రేపుకుంటూ ముందుకు సాగిపోయింది వైట్ బస్.

'గంగాపూర్ - ఐదు కిలోమీటర్లు' అన్న మట్టికొట్టుకుపోయిన చెక్కబోర్డు ఒకటి వున్నదక్కడ. బాణపు గుర్తు వున్నవైపు కాలిబాట వుంది.

దట్టా దట్టమయిన అడవి. గతుకుల బస్‌రూట్ తప్పితే అంతా ఫారెస్ట్ ఏరియా.

వాచ్ చూసుకున్నాడు గిరి. సాయంత్రం అయిదు దాటింది. పరిసరాలలో చీకట్లు ముసురుకుంటున్నాయి. పశువులను ఇళ్ళకు మళ్ళిస్తున్న కాపరులు మిలిటరీ దుస్తులలో వున్న గిరివంక వింతగా చూసారు

గంగాపూర్‌కి దారి సరిగా వుంటుందా అని వారిని అడిగాడు గిరి. కాలిబాట పరవాలేదన్నారు. చీకటిపడితే అడవి మృగాల బెడద వుంటుందని హెచ్చరించారు.

'అయిదు కిలోమీటర్లు - సుమారు అరగంటలో వెళ్ళిపోవచ్చును' అనుకున్నాడు గిరి సిగరెట్ ముట్టిస్తూ.

ఒకచేతిలో బెడ్డింగూ, మరో చేతిలో బ్రీఫ్‌కేసూ పట్టుకుని షూస్‌తో మట్టిరోడ్డుపైన దుమ్ము రేపుకుంటూ ప్రకృతిని ఆసక్తిగా తిలకిస్తూ ముందుకు సాగాడు.

అయిదేళ్ళ తరువాత చంద్రాన్ని చూడబోతున్నాడు తాను. హఠాత్తుగా తనను చూసి సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతాడు చంద్రం.

కాళ్ళు ముందుకు సాగుతూంటే గిరి మనసు మాత్రం వెనక్కి...గతంలోకి మళ్ళింది...

* * *

అయిదేళ్ళ క్రితపు మాట అది—

తాను, చంద్రమూ ఒకే బళ్ళో చదువుకున్నారు. ఒకే ప్రాణంగా వుండేవారు. తమ గ్రామంలో ఎలిమెంటరీ స్కూలే ఉండేది. పొరుగూర్లో వున్న హైస్కూలుకి వెళ్ళి చదువుకున్నవాళ్ళు తామిద్దరే. రోజూ నాలుగుమైళ్లు నడిచి వెళ్ళివచ్చేవాళ్ళు. తమది ఏజెన్సీ ఏరియా కావడంతో చుట్టుపక్కల అడవులలో ఎన్నో రకాల జంతువులు తిరుగాడుతూ ఉండేవి. చంద్రం, తానూ మొదట బాణాలతోనూ తరువాత తుపాకీలతోనూ జంతువులను వేటాడడం నేర్చుకున్నారు.

చిన్నప్పుడే తల్లి, తండ్రీ పోవడంతో చిన్నాన్న దగ్గర పెరిగాడు తాను. పొలం పనులు చూసుకుంటూ చిన్నాన్నకు సాయపడాలనీ మంచి రైతుగా అనిపించుకోవాలనీ వుండేది తనకు. కాని చంద్రానికి అది ఇష్టంలేదు. ఏదైనా ఉద్యోగం చేయాలనేవాడు. పొలంలో గొడ్డులా చాకిరీచేయడానికి రోజూ అన్ని కిలోమీటర్ల దూరం నడిచివెళ్ళి చదువుకోవలసిన అవసరం లేదనేవాడు.

ఆ విషయంలో పార్వతి చంద్రాన్నే సమర్థించేది. తనవంటి తెలివితేటలు గలవాడు, చదువుకున్నవాడు వుద్యోగమే చేయాలనీ, ఆ పల్లెలో మట్టిపిసుక్కోవడం కూడదనీ అనేది. హైస్కూల్ చదువంటే ఆమె దృష్టిలో డిగ్రీ తీసుకున్నట్లే లెక్క.

చంద్రం మేనమామ కూతురు పార్వతి. తెల్లగా బొద్దుగా, అందంగా ఉండేది. ఎలిమెంటరీ స్కూలుతో చదువుకు స్వస్తి చెప్పింది. తరచు చంద్రం ఇంటికి రాకపోకలు వుండడంతో పార్వతితో బాగా స్నేహమైంది తనకు. అది ప్రేమగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు. ఒకరిని చూసుకోకుండా మరొకరు వుండలేని స్థితికి వచ్చారు తాము. సహజంగా గ్రామాలలో పెళ్ళీడుకొచ్చిన

ఆడపిల్లలకు పొద్దులు కొంచెం ఎక్కువే ఉంటాయి. ఎప్పుడో కాని వాళ్ళ గుమ్మం దిగడానికి వీలుండదు. అందుకే స్కూలు నుంచి రాగానే చంద్రం ఇంటికి వెళ్ళే వాడు తాను. ఏదో విధంగా పార్వతిని కలుసుకోవడం జరిగేది. చంద్రానికి తమ విషయం తెలిసినా, వారి భావాలు ఏమిటో ఏనాడూ వెలిబుచ్చలేదు వాడు— చదువు పూర్తి కాగానే చిన్నాన్నతో చెప్పి పార్వతిని పెళ్ళాడాలనుకున్నాడు తాను.

కాని—

అనుకున్నవన్నీ సవ్యంగా జరిగితే 'విధి'కి తావెక్కడిది? మానవుడు దైవాన్ని లెక్క చేస్తాడా?

త్వరలో చదువు ముగించుకుని పార్వతిని పెళ్ళాడాలనుకున్న తాను- అలా ఎవరికీ చెప్పకుండా ఇల్లు విడిచి పారిపోతాడనీ, మిలిటరీలో చేరిపోతాడనీ ఎవరనుకున్నారు!?

అనుకున్నవి జరక్కపోవడమూ, అనుకోనివి జరగడమూ - విధి విచిత్ర లీలలలోని విశిష్టత ఏమో!

ఆరోజు - తాను ఏదో పనిమీద పొరుగూరికి వెళ్ళి తిరిగివస్తున్నాడు. అప్పటికే చీకట్లు దట్టంగా ముసురుకుంటున్నాయి. టార్చి వెలుతురులో దారి చూసుకుంటూ పాడుకుంటూ వస్తున్నాడు. ఊరి పొలిమేరల్లోకి వచ్చేసరికి ఎక్కడినుంచో హఠాత్తుగా ఆడపిల్ల కేకలు వినిపించాయి. చేరువలో వున్న సరుగుడుతోపు నుంచి ఆ కేకలు వినిపిస్తున్నట్లు గ్రహించి అటువైపు పరుగెత్తాడు.

టార్చి వెలుగులో కనిపించిన దృశ్యాన్ని చూసి కొన్ని సెకనులు మ్రాన్పడిపోయాడు తాను.

అర్ధనగ్నంగా వున్న ఒక ఆదిమ జాతి యువతి, ఎవరో యువకుడితో తీవ్రంగా పెనుగులాడుతోంది. ఆమె కట్టుకున్న అద్దాలపరికిణీ ఊడిపోయి కాళ్ళకు చుట్టుకుంది. జాకెట్ చిరిగి ముక్కలైంది. ఒకపక్క ఆమెను కౌగిలించుకుంటూ మరోపక్క లోపలి లంగాను తెంపడానికి ప్రయత్నిస్తున్నాడతను. మానాన్ని కాపాడుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూ మధ్య మధ్య కేకలు వేస్తోందామె.

ఆ దృశ్యం చూడడంతో క్రోధావేశంతో వొళ్ళు తెలియలేదు తనకు. పెద్దగా అరిచి అటువైపు లంఘించాడు. ఆవ్యక్తి వీపుమీద బలంగా గుద్ది మెడపట్టి వెనక్కి తిప్పాడు వాణ్ని. అంతలోనే ఉలిక్కిపడి అప్రయత్నంగా వాణ్ణి వదిలేసాడు, 'చంద్రం!?' అంటూ.


చంద్రం సిగ్గుతో, భయంతో తల వంచుకున్నాడు. 'చంద్రం! ఏమిటిది?' అన్నాడు తాను కోపంగా, అసహ్యంగా. 'క్షమించరా గిరీ! పొరపాటు జరిగిపోయింది, ఎవరికీ చెప్పకు' అంటూ ప్రాధేయపడుతూ తన చేతులు పట్టుకున్నాడు. తన స్నేహితుడు అటువంటి

నీచపు పనికి పొడిగట్టాడంటే నమ్మలేక పోయాడు తాను- అసహ్యం అలుము కోగా, ఆ క్షణంలో చంద్రాన్ని తాను ఏమన్నాడో తనకే గుర్తు లేదు. తేరుకునే సరికి చంద్రం అక్కడ లేడు. పరాభ వితురాలయిన ఆ యువతి ఏడుస్తూంటే ఎలాగో అయిపోయింది తనకు. ఆమెను ఓదార్చి, జరిగింది మరచిపోవలసిందిగా కోరి, ఆమెను గూడెం వరకు దిగబెట్టి వచ్చాడు తాను. ఆమె ఆ విషయాన్ని తనవారికి చెబితే పర్యవసానం ఎలా వుంటుందో తనకు తెలుసు; తెల్లవారే సరికి చంద్రం శవం అడవిలోని క్రూర మృగాలకు ఆహారమవుతుంది.

వారం రోజులపాటు తనను తప్పించుకు తిరిగాడు చంద్రం. పార్వతిపైతం ఎందుకు కనిపించడం మానివేసిందో అర్థంకాలేదు తనకు. చివరకు ఎలాగైతేనేం ఒకరోజున పెరట్లో మొక్కలకు నీళ్ళు పోస్తూంటే కలుసుకోగలిగాడు ఆమెను.

'పరాయి ఆడపిల్లల్ని బలాత్కరించే నీచుడివి. నీ ముఖం నాకు చూపించకు పొమ్మంది' పార్వతి. నిర్ఘాంతపోయాడు తాను. తేరుకునేసరికి ఆమె అక్కడ లేదు. తరువాత చంద్రాన్ని పట్టుకుని నిలవేశాడు తాను. 'పార్వతి పలుకులకు అర్థమేమిటని'. చంద్రం తనకేమీ తెలీదు అన్నాడు కాని వాడే తనమీద పార్వతికేదో చెప్పి వుంటాడన్న అనుమానం కలిగింది తనకు. ఎలాగైనా పార్వతిని కలుసుకుని మాట్లాడాలనీ తనపైన వున్న అపోహను తొలగించాలనీ తాను ఎంతో ప్రయత్నించాడు. కాని ప్రయోజనం లేకపోయింది.

పార్వతి తనను కలుసుకోవడానికి అంగీకరించడంలేదనీ, తానంటేనే అసహ్యించుకుంటోందనీ చంద్రం చెప్పాడు. ఒకరోజున వార్త మోసుకొచ్చాడు వాడు- 'పార్వతికి పెళ్ళి చేయబోతున్నారని'. తన గుండె ఆగినంత పనయింది వినడంతో. తన పంచప్రాణాలలో ఒకటి జారిపోతున్నట్లు వ్యథకు గురయ్యాడు పార్వతిని కలుసుకోవాలన్న చివరి ప్రయత్నం కూడా విఫలమవడంతో జీవితంపైన విరక్తి కలిగింది తనకు. పార్వతి దూరమయ్యాక యిక తనకు ఆ ఊళ్లో వుండాలనిపించలేదు. అంతే; ఎవరితోనూ చెప్పాచేయకుండా వూరు విడిచి పెట్టేసాడు. బంగ్లాదేశ్ విముక్తికి యుద్ధం జరుగుతోంది. సైన్యానికి యువకులను నమోదు చేసుకుంటున్నట్లు తెలిసి, పట్నం వెళ్ళి మిలిటరీలో చేరిపోయాడు. వార్ ఫ్రంట్‌లో శత్రువులతో పోరాడుతూ కూడా పార్వతిని మరచిపోలేదు తాను. ఎలాగో తీరిక చేసుకుని మూడేళ్ళకు చంద్రానికి ఉత్తరం రాశాడు 'పార్వతికి పెళ్ళయిపోయిందనీ, తాను గంగాపూర్‌లో ఫారెస్టు డిపార్టుమెంట్‌లో ఏదో ఉద్యోగం సంపాదించినట్లు'




జవాబిచ్చాడు చంద్రం. ఆ తరువాత తమ మధ్య మళ్ళీ ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. అయిదేళ్ళ తరువాత సెలవు సంపాదించి మిత్రుణ్ణి ఆశ్చర్యంలో ముంచెయ్యాలని ఉత్తరం రాయకుండానే బయలుదేరాడు... ముందు గంగాపూర్ వెళ్ళి చంద్రాన్ని చూడాలి. అతనిద్వారా పార్వతి ఎక్కడ వున్నదీ ఎలా వున్నదీ వివరాలు తెలుసుకోవాలి. ఆమె ఊరు వెళ్ళి దూరం పంచయినా ఒకసారి పార్వతిని చూసిరావాలి-' అనుకున్నాడు.

* * *

గిరి గంగాపూర్ చేరుకునేసరికి చీకటి పడింది. గ్రామంలో పంచాయతీ దీపాలు చీకటి తెరలను పారద్రోలడానికి వృథా ప్రయత్నం చేస్తున్నాయి.

మిలిటరీ యూనిఫాంలో టకటక నడుస్తున్న తనవంక కుతూహలంగా చూస్తున్న గ్రామస్థులను చూసి లోలోపలే నవ్వుకున్నాడు గిరి. చిన్నప్పుడు తానూ మిలిటరీ దుస్తులలో ఎవరు కనిపించినా అలాగే వింతగా చూసేవాడు.

"ఎవరింటికి బాబూ?" పలుకరించాడొక వ్యక్తి.

గిరి చెప్పడంతో ఒక కుర్రాణ్ణి తోడు ఇచ్చి చంద్రం ఇంటికి పంపించాడతను. చిన్నదైనా చక్కగా వుంది పెంకుటిల్లు. చుట్టూ పూలమొక్కలు, పాదులు వగైరాలతో విందుగా వుంది.

బెడ్డింగు అరుగుమీద పెట్టి, 'చంద్రం' అంటూ పిలిచాడు గిరి.

ఆ పిలుపు విని వాకిట్లోకి వచ్చిన స్త్రీ తలుపు వెనకనుంచే జవాబిచ్చింది. 'చంద్రం క్యాంప్ వెళ్లారండీ. మర్నాడు గాని రారండీ.'

ఒక క్షణం ఇబ్బందిగా ఫీలయ్యాడు

క్రీనీడలో నిలుచున్న గిరి.

"నా పేరు గిరి. చంద్రానికి బాల్య మిత్రుణ్ణి. మిలిటరీలో వుంటున్నాను. వాణ్ణి చూడాలని సెలవులో వచ్చాను."

అతని పలుకులు వింటూనే చటుక్కున తలుపుచాటు నుంచి బయటకు వచ్చిందామె. గడపమీద వున్న లాంతరు పైకెత్తి అతనివంక చూసింది.

"గిరీ!" అంది.

అదే క్షణంలో ఆమెను చూసిన గిరి ఉలిక్కిపడ్డాడు. అతని చేతిలోని బ్రీఫ్ కేస్ జారిపోయింది.

"పార్వతీ!" అన్నాడు అప్రయత్నంగా.

"పార్వతీ! నువ్వు...నువ్విక్కడ!?" అయోమయంగా గొణిగాడు గిరి.

"ఔను గిరీ! నేను బావనే చేసుకున్నాను... లోపలికి రా" అందామె పమిటచెంగు పూర్తిగా కప్పుకుంటూ.

గిరికి అంతా అయోమయంగా వుంది. పార్వతిని తానే పెళ్ళాడినట్లు చంద్రం తనకెందుకు రాయలేదు? ఏం జరిగిందో? ఇదెలా జరిగిందో తెలుసుకోవాలని ఆతృతగా వుంది.

స్నానం చేస్తున్నంత సేపూ, భోజనం చేస్తున్నంత సేపూ ఆలోచిస్తూనే వున్నాడు అతను

భర్త స్నేహితుడికి చేయవలసిన మర్యాదలను చేస్తోంది పార్వతి. ఆమె మనసు కూడా నిర్మల తటాకంలో రాయి విసిరినట్లయిపోయింది. అతని రాకతో గత స్మృతులు ఇద్దరి మనసులనూ కలచివేస్తూంటే బరువెక్కిన హృదయాలతో నిశ్శబ్దంగా వుండిపోయారు.

మర్నాడు చంద్రం వచ్చేంతవరకు గిరి మనసు ఆగడంలేదు. వివరాలను ఆమె ద్వారానైనా తెలుసుకోవాలని మనసు వేగిరపడుతోంది.

అరుగుమీద పక్క వేసింది పార్వతి అతనికి. మంచినీళ్ళు అక్కడ పెట్టి వెళ్ళిపోతూంటే అన్నాడు గిరి- "పార్వతీ! ఎందుకు...ఎందుకిలా జరిగింది?"

"ఏమిటి?"

"నన్నెందుకు దూరం చేసావ్? నేనేం అపరాధం చేసానని?" అతని గొంతు అతనికి తెలీకుండానే గద్గదమయింది.

ఆమెకు తెలియకుండానే వుక్రోషము, ఆగ్రహము, ఆవేదనా వుప్పొంగాయి.

"నువ్వు... నువ్వు పిరికిపందలా పారిపోయావు"

"పార్వతీ!"

"నీకు మనసిచ్చినందుకు నన్ను మోసం చేసావు. నీ అసలు రూపం వెల్లడి కావడంతో వూరు విడిచి పారిపోయావు"

"పార్వతీ! నేను... నేను నిన్ను మోసం చేసానా!!"

"లేదా మరి? గిరీ! నువ్వు ఎవరో గిరిజన యువతిని బలాత్కరించావని నాన్న చెబితే మొదట నమ్మలేదు నేను.

నువ్వు వస్తావనీ, అదంతా అబద్ధమని చెబుతావనీ ఆశించాను. హుఁ, తప్పు చేసినవాళ్ళకు ముఖం ఎలా చెల్లుతుంది! ఆరోజు నేను చీదరించుకోవడంతో మళ్ళీ నీ ముఖం నాకు చూపించే ధైర్యం నీకు లేకపోయింది. ఎన్నిసార్లు బావచేత కబురుపెట్టినా, నన్ను నానా మాటలూ అన్నావట. చివరకు మావాళ్ళు నాకు పెళ్ళి నిశ్చయం చేయబోతున్నారని తెలుసుకుని నీకు కబురుపెట్టాను, నన్ను దక్కించుకొమ్మని. కాని, మనిద్దరికీ ఎటువంటి సంబంధమూ లేదనీ, నావంటి అహంకారిని పెళ్ళాడవలసిన ఖర్మ నాకేం పట్టలేదనీ జవాబు పంపించావు. నిన్ను కలుసుకుని మాట్లాడాలని ఎన్ని కబుర్లు పంపినా, నువ్వు మా ఇంటి ఛాయలకే రాలేదు సరిగదా, బహుశా నేను బలవంతం చేస్తానన్న భయంతో కాబోలు వూరినుంచే మాయమయ్యావు- గిరీ! నవ వికసిత మనోకుసుమాన్ని ఒకరికి అర్పించి, వారినే తన సర్వస్వంగా భావించుకున్న ఒక కన్య- ఆ వ్యక్తి తన కలలను కాల్చివేసి, ఆశలను కూల్చివేసి, తన వ్యక్తిత్వంపైన దెబ్బతీసి పిరికిపందలా పారిపోతే, ఆమె గతి ఏమిటి?..."

"పా...ర్వ...తీ!..."

"నాకు జీవితంపైనే రోత పుట్టింది. నా గిరి... నేను నమ్ముకున్న గిరి... నన్ను సర్వనాశనం చేస్తాడంటే ఒక పట్టాన నమ్మకం కలిగేది కాదు. ఏదో క్షణంలో తిరిగివస్తాడన్న ఆశతో కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూసేదాన్ని. కాని, నా ఆశలు ఆశలుగానే మిగిలిపోవడంతో, పెద్దల బలవంతాన బావతో వివాహానికి ఒప్పుకోక తప్పలేదు. జీవచ్ఛవంలా గడపడం కంటె నాకిక మిగిలిందేమీ లేదు..." గద్గదస్వరంతో చెప్పుకుపోయిన పార్వతి, కన్నీరు తుడుచుకుంటూంటే అప్రతిభుడయ్యాడు గిరి.

'అబద్ధం!' అని అరవాలనుకున్నాడు.

ఏం జరిగిందో విశదమయింది. ఆనాటివరకు వున్న సందేహాలు సూర్య కిరణాలు సోకిన మంచుతెరలలా విడిపోయాయి

'చంద్రం! మిత్రద్రోహీ! ఎంత పని చేశావ్? మమ్మల్ని విడదీయడానికి ఎంత నాటకమాడావు?...' గిరి హృదయం ఆక్రోశించింది.

ప్రాణమిత్రుడని వాడు చేసిన అప్రాచ్యపు పనిని కప్పిపుచ్చినందుకు ఫలితంగా తననే కాటువేసాడా! ఎందుకిలా చేసాడు? తనముందు నీచుడిలా దొరికిపోయాడే అన్న న్యూనతతోనా? వాడి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సే అందుకు కారణమా!?

కుట్ర పన్ని పార్వతినీ, తననూ వేరు చేశాడు. ఆమెను పెళ్ళాడాడు. అందుకే ఆ విషయాన్ని తన మంచి

చాడు. పార్వతికి తనపైన అసహ్యం పెరుగుపోయేలా చేసాడు,

చంద్రాన్ని తలచుకునేసరికి అసహ్యం, ఆగ్రహం, ఆవేశం- అన్నీ వొక్కుమ్మడిగా పెనవేసుకున్నాయి గిరిని ఆ క్షణంలో చంద్రం అక్కడ వున్నట్లయితే వాడిని ఏంచేసేవాడో తాను!!

పార్వతితో నిజం చెప్పేయాలనుకున్నాడు- చంద్రం ఆడిన నాటకం వెల్లడి చేయాలనుకున్నాడు-

“పార్వతీ!” అన్నాడు.

కాని, అప్పటికే లోపలికి వెళ్ళిపోయి తలుపులు మూసుకుందామె.

జరిగిన అన్యాయం తలచుకుంటే గుండెలు పిండినట్లుంది గిరికి. ఇప్పుడు తాను ఏం చెప్పినా పార్వతికి నమ్మకం కలగకపోవచ్చును. మిత్రుడి ద్రోహం తలంపుకు వచ్చి వుక్రోషం పెరిగిపోతోంది. అతనికి తెలీకుండానే నరనరాలలో చంద్రం అంటే అసహ్యం, పగ ఏర్పడ్డాయి. ప్రతీకారం తీర్చుకోవాలి! వాడు చేసిన మోసానికి వాడిపైన పగ తీర్చుకోవాలి! తన జీవితాలను నాశనం చేసిన ఆ మిత్రద్రోహిని, నయవంచకుణ్ణి వూరికే విడిచిపెట్టకూడదు. యుద్ధ రంగంలో ఎందరినో చంపిన తనకు చంద్రం ప్రాణాలు ఒక లెక్కకాదు... ఆలోచిస్తూనే నిద్రాదేవి వొడిలో ఒరిగిపోయాడు గిరి.

## 2


మర్నాడు క్యాంపు నుంచి తిరిగి వచ్చిన చంద్రం, గిరిని చూస్తూనే గతుక్కుమన్నాడు. ఒక్కసారిగా పాత విషయాలన్నీ జ్ఞప్తికి వచ్చాయి. 'పార్వతిని చూసి గిరి ఏమనుకున్నాడు? తన మోసం గ్రహించాడా? ఏ విధంగా గిరికి నచ్చ చెప్పాలి?' అన్న ఆలోచనలు రేగాయి.

పైకిమాత్రం మామూలుగా సంతోషాన్ని వ్యక్తపరుస్తూ స్నేహితుణ్ణి పలకరించాడు. గిరి స్వేచ్ఛగా, స్వచ్ఛంగా మిత్రుడితో మాట్లాడలేకపోయాడు. అతని అణువణువునా చంద్రం పైన ద్వేషం, పగ నిండుకున్నాయి.

గిరిలో మార్పును చంద్రం పసిగట్టక పోలేదు, అయినా ఏమీ తెలీనట్లే నటించాడు, తన వుద్యోగపు విషయాలు ముచ్చటించాడు.

బ్రేక్‌ఫాస్ట్ అయ్యాక “అలా ఫారెస్టులో వేటాడివద్దాం పద. అయిదేళ్ళ తరువాత కలుసుకున్నాం. ఈ అకేషన్‌కి చిహ్నంగా మంచిపులిని ప్రైజ్‌గా కొట్టుకొద్దాం” అంటూ మిత్రుడికో గన్ ఇచ్చి తానొక గన్ తీసుకుని బయలుదేరాడు చంద్రం

'అదీ ఒకందుకు మంచిదే' ననుకుంటూ మిత్రుడివెంట నడిచాడు గిరి. 'అడవిలోనైతే చంద్రాన్ని చంపినా చూసేవాళ్ళుండరు. ఏ క్రూరమృగపు




వాళ్ళో వద్దాదని చెప్పొచ్చునను' అనుకున్నాడు.

చంద్రాన్ని నిలదీసి అడిగివేయాలనిపించినా అద్దంలోని ప్రతిబింబంలా జరిగిన మోసం స్పష్టంగా తెలుస్తూంటే వాళ్ళ నడగటం అనవసరం. మోసాన్ని మోసంతోనే జయించాలి. వీలుచూసి బులెట్ని వాడి గుండెల్లో దింపాలి. భర్తృహీన అయిన పార్వతిని ఓదార్చి తనతో తీసుకుపోవాలి. తనదాన్ని చేసుకోవాలి. ఇలా సాగిపోతున్నాయి గిరి ఆలోచనలు.

'గిరికి ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? తన చర్యలను ఎలా సమర్థించుకోవాలి?' అనుకుంటూ సతమతమయ్యాడు చంద్రం

దారి పొడవునా మిత్రులిద్దరూ ఎవరికి వారు ఆలోచించుకుంటూ మౌనంగా వుండిపోయారు.

దట్టమైన అడవిలో ప్రవేశించారు. వుద్యోగరీత్యా ఫారెస్ట్ లైఫ్‌కి అలవాటు పడివున్న చంద్రం కొత్త కొత్త విషయాలను మిత్రుడికి వివరిస్తున్నాడు. రకరకాల క్రూరమృగాల అలవాట్లను గూర్చి వాటి అడుగుజాడలను గూర్చి చెబుతున్నాడు. గిరి సాలోచనగా ఊకొడుతున్నాడు.

కొంతదూరం వెళ్ళాక హఠాత్తుగా ఆగిపోయాడు చంద్రం, మిత్రుడి చేయి పట్టుకొని.

"అదిగో ఆ పొదలవెనుక చప్పుడవుతోంది విన్నావా? అక్కడ పులి వున్నదన్న మాట...నేను అటువక్క నుంచి దానికి చేరువగా వెడతాను. నువ్వియిక్కడే నిలుచుని సిద్ధంగా వుండు. ఒకవేళ నా గురి తప్పి పులి తప్పించుకున్నట్లయితే, ఇటే పారిపోయివస్తుంది. రాగానే దాన్ని మట్టుపెట్టాలి నువ్వు"

మెల్లగా గుసగుసలాడుతున్నట్టు అన్నాడు చంద్రం "జాగ్రత్త సుమా! యుద్ధంలో మనుషులను షూట్ చేయడం కాదు-ఇది క్రూరమృగాల వేట. అసలే పెద్దపులి అంటే పచ్చినెత్తురు తాగేది. ఒకవేళ నీ దెబ్బ దానిని గాయపరచి పులి తప్పించుకున్నదనుకో-అది నిన్ను చంపనిదే విడిచిపెట్టదు దాని పగ అటువంటిది... ఓ కేర్ ఫుల్!" అంటూ హెచ్చరించి చప్పుడుచేయకుండా పులివున్న వైపు నడిచాడు చంద్రం.

'హుఁ! పులికంటె పెద్ద పగ నాది! పులి తప్పించుకున్నా, నా బులెట్ ని నువ్వు తప్పించుకోలేవు, చంద్రం!' అనుకుని కసిగా పళ్ళు కొరుక్కున్నాడు గిరి.

చంద్రం చేరువకు వచ్చేసరికి ఎలాగో పసిగట్టిన పులి పెద్దగా గాండ్రించుతూ అతనిపైకి వురికింది.

చంద్రం షూట్ చేసాడు-

బులెట్ పులికి రాచుకుంటూ పోయింది మరోసారి ఫైర్ చేసాడు చంద్రం. అది దాని తొడకు గాయంచేసింది. బెదిరిన పులి చంద్రాన్ని అటాక్ చేసే వుద్దేశ్యాన్ని విరమించుకుని ప్రక్కనున్న పొదల లోకి వురికి అదృశ్యమయింది.

గిరి దగ్గరకు వచ్చాడు చంద్రం.

"పులి తప్పించుకుపోయింది అయినా దెబ్బ తొడమీద తగిలింది కనుక ఎక్కువ దూరం వెళ్ళుండదు. వెదుకుదాం పద," అన్నాడు.

ఇద్దరూ తలోవైపు వెతుకుతూ, మళ్ళీ అన్నాడు చంద్రం- "గిరీ! బలమైన దెబ్బతగిలింది పులికి, మనమీద విపరీతమైన ఆగ్రహం కలుగుతుంది దానికి. బాగా పగబట్టి వుంటుందన్న మాట. ఏదో ప్రక్కనుంచి మనపైకి వురకవచ్చును. కాస్త జాగ్రత్తగా చూసుకో."

ఇద్దరూ చెరోవైపు వెళ్ళారు పులిని వెదుకుతూ. కొంతదూరం వెళ్ళాక ఒక చెట్టుచాటున ఆగి తిరిగి చూసాడు గిరి. అక్కడికి చంద్రం స్పష్టంగా కనిపిస్తున్నాడు. అతని వీపు గిరివైపు వుంది.

అదే మంచి అవకాశం! అక్కడి నుంచి షూట్ చేస్తే గురి. తప్పదు. చంద్రంపైన పగదీర్చుకునే అవకాశాన్ని పులికి ఇవ్వడం గిరికి ఇష్టంలేదు.

గన్ పైకెత్తాడు గిరి. చంద్రానికి ఎయిమ్ చూసాడు.

'చంద్రం! నువ్వు స్వార్థంతో నాకు, పార్వతికి చేసిన ద్రోహం క్షమించరానిది చివరకు స్నేహితుణ్ణే చంపవలసిన దుస్థితికి తీసుకొచ్చావు నన్ను. ఇందుకు పూర్తి బాధ్యత నీదే- అయాం సారీ, ఫ్రెండ్!' అనుకున్నాడు మదిలో కసిగా.

ఊపిరి బిగబట్టి ట్రిగ్గర్ పైన వేలేసాడు.

అదే సమయంలో-



చంద్రానికి వెనుకగా చప్పుడు చేయకుండా ఎక్కడినుంచో వచ్చింది పులి. చంద్రంపైకి వురకమంది

అంతలోనే దాని చూపులు అప్రయత్నంగా గిరిపైన పడ్డాయి. దాని కళ్ళలో ఆశ్చర్యం తళుక్కుమంది!

మిత్రుడికి తుపాకి గురిపెట్టిన గిరి కూడా పులివంక చూసాడు.

తనకంటె ముందు పులే చంద్రంపైన పగ తీర్చుకుంటుందేమోనని కంగారు పడ్డాడు.

అయితే-

నిశ్శబ్దంగా చంద్రంపైన విరుచుకు పడబోయిన పులి హఠాత్తుగా ఆగిపోయింది. చంద్రాన్ని హెచ్చరిస్తున్నట్లుగా పెద్దగా గాండ్రించింది. మెరుపులా తిరిగి గిరిపైకి లంఘించింది-

పులి గర్జనకు అదిరిపడి పక్కకు గెంతాడు చంద్రం.

చంద్రానికి తగలవలసిన బులెట్, అడ్డువచ్చిన పులి గుండెల్ని చీల్చింది.

గిరి మ్రాన్పడిపోయాడు.

పులి! చంద్రం చేతిలో తీవ్రంగా గాయపడి, వాడిమీద పగబట్టిన పెద్దపులి! చంద్రాన్ని చంపడానికి చక్కని అవకాశంపొంది- వాణ్ణి విడిచిపెట్టేసింది! ఎందుకు? ?

తాను చంద్రానికి గురిపెట్టడం

చూపింది. తన శత్రువును మరొకరు మట్టుపెడుతున్నట్లు గ్రహించింది. ఐనా సంతోషించడానికి బదులు వాణ్ణి హెచ్చరించిందేం? వాడి మానాన వాణ్ణి విడిచి తాను పొదల్లో దూరి ప్రాణాలు దక్కించుకోలేదేం? తన బులెట్ బారినుంచి వాణ్ణి రక్షించడానికి తన ప్రాణాలనే బలి ఇచ్చిందేం!!

పెద్దపులి! పచ్చినెత్తురు తాగే క్రూర మృగం!

దాని సైకాలజీని అర్థంచేసుకోవాలని ప్రయత్నించాడు గిరి.

శత్రువు చేతికి చిక్కినా చంపకుండా అతనికి రానున్న అపదను గూర్చి హెచ్చరించింది. తన శత్రువును చంపబోతున్నవాడి పైకి లంఘించింది... ఆ క్షణంలో దాని కన్నులలో తళుక్కుమన్న భావానికి అర్థమేమిటి? మానవులు తమను తామే మోసంతో చంపుకుంటున్నారన్న ఆశ్చర్యమా? లేక, జంతువులు కేవలం శత్రువులనే మట్టుపెడితే - మనుష్యులు స్నేహితులకే ద్రోహం తలపెడతారేమో అన్న విభ్రాంతా!!

పులి ప్రవర్తన గిరిలో పెద్ద సంచలనాన్ని సృష్టించింది.

క్రూరజంతువై వుండీ మనుషుల కంటె ఉన్నతంగా ప్రవర్తించిందది.

కాని, తానో...?

ఉన్నతమైన మానవజన్మ ఎత్తి పశువుకంటే హీనంగా ప్రవర్తించాడు. చంద్రం స్వార్థంతో తనను మోసగించి వుండవచ్చును. కాని, తాను చేస్తున్నదేమిటి? స్నేహాన్ని మరిచి పగపెంచుకుని మిత్రుణ్ణే చంపడానికి పూనుకున్నాడు! క్షణికావేశంలో స్వార్థచింతనతో ప్రాణప్రదమయిన పార్వతి పసుపు కుంకుమలనే చెరిపివేయాలనుకున్నాడు. తాను! చంద్రానికీ, తనకూ తేడా ఏమిటి? కేవలం జంతువుకు వున్న జ్ఞానం కూడా తనకు లేకపోయిందేం!!

'భగవాన్! పులి నా కళ్ళు తెరిపించింది... పార్వతీ! నువ్వయినా సుఖంగా వుండటమే నాకు కావలసింది - నీకు అన్యాయం తలపెట్టినందుకు నన్ను క్షమించు... చంద్రం! నా నీచపుటాలోచనకు సిగ్గుపడుతున్నాను! ఇప్పటికే నీ గుట్టు వెల్లడయిందన్న భయంతో సగం చచ్చివుంటావు. నిన్ను పూర్తిగా చంపా అనుకోవడం పొరపాటు... పార్వతీ, నువ్వూ సుఖంగా వుండండి... నేను వెళ్ళిపోతున్నాను. మళ్ళీ ఎన్నడూ నా ముఖం మీకు చూపించనంత దూరంగా వెళ్ళిపోతున్నాను...'

చంద్రానికి మాట మాత్రమయినా చెప్పకుండా అక్కడినుంచి అటే వెళ్ళిపోయాడు గిరి. *